క్లుప్తంగా

పోగొట్టుకున్న ఫోన్లు అందజేత



ఖలీల్‌వాడి: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ల బాధితులకు జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయంలో డీసీపీ శ్రీనివాస్‌రావు ఫోన్లను శనివారం అందజేశారు. డీసీపీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు సెల్ ఫోన్లను వాడడంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలో పోయిన 60 మంది సెల్‌ఫోన్ల బాధితులకు కార్యాలయంలో అందించినట్లు పేర్కొన్నారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్ వివరాలు సేకరించి బాధితులకు అందించినట్లు తెలిపారు. ఫోన్లుపోయిన వెంటనే బాధితులు పీఎస్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థికసాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న భాస్కర్‌రెడ్డి

సిరికొండ: మండలంలోని తూంపల్లి, కొండాపూర్ గ్రామాల్లో బాధితులకు డీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్కోల్ భాస్కర్‌రెడ్డి రూ. పది వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట మహేందర్, సంపత్‌రెడ్డి, శ్రీధర్, బుచ్చన్న, గౌస్, చంద్రగౌడ్, దేవరాజు, లక్ష్మణ్, వినోద్, మోజీరం, జీవన్, రూప్‌సింగ్, సంతోష్‌నాయక్ తదితరులు దున్నారు.

ఖిల్లా డిచ్‌పల్లిలో..

డిచ్‌పల్లి: మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లికి చెందిన మంగళి రాజన్న ఇటీవల మృతి చెందడంతో గల్ఫ్ చేయూత సంఘం సభ్యులు బాధిత కుటుంబానికి రూ.6,500 ఆర్థికసాయం అందజేశారు. సంఘం సభ్యులు జె అశోక్, మురళి, నర్సయ్య, సురేందర్, భూమన్న తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు 200 పని దినాలు కల్పించాలి



కూలీలతో మాట్లాడుతున్న వేల్పూర్ భూమయ్య

డిచ్‌పల్లి: పని అడిగిన ప్రతి ఒక్కరికి జాబ్ కార్డు ఇచ్చి 200 రోజులు ఉపాధి పని దినాలు కల్పించాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య డిమాండ్ చేశారు. శనివారం డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్‌లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలను కలిసి మాట్లాడారు. ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు వాసరి సాయినాథ్, నాయకులు దాసు, కృష్ణ, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లిలో..



కూలీలతో మాట్లాడుతున్న బాలయ్య

ధర్పల్లి: ఉపాధి హామీ పథకంలో 200 రోజులు పని దినాలు కల్పించాలని, కొలతలతో సంబంధం లేకుండా కనీస వేతనం రోజుకు 600 ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ భీంగల్ సబ్ డివిజన్ కార్యదర్శి బాలయ్య డిమాండ్ చేశారు. ధర్పల్లిలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత 12 వారాల నుంచి ఉపాధి కూలీలకు డబ్బులు ఖాతాలో జమ కావడం లేదని, వెంటనే బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బాలయ్య, ఊషన్న, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ తరలిన పీవోడబ్ల్యూ శ్రేణులు



సిరికొండ: జిల్లాలోని సిరికొండ, ధర్పల్లి, కమ్మర్‌పల్లి మండలాలకు చెందిన ప్రగతిశీల మహిళా సంఘం(పీవోడబ్ల్యూ) నేతలు శనివారం హైదరాబాద్ తరలివెళ్లారు. హైదరాబాద్‌లో వచ్చే నెలలో నిర్వహించే అందాల పోటీలకు వ్యతిరేకంగా చేపట్టిన ఆందోళనలో పాల్గొనడానికి వారు వెళ్లారు. నాయకులు గోదావరి, సత్యమ్మ, నాగమణి, రమ, పుష్పలత, జమున, లావణ్య, మానస తదితరులు ఉన్నారు.

ఉగ్రవాదుల దాడి అత్యంత కిరాతకం



ఐఎంఏ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, వైద్య, నర్సింగ్ కళాశాలల విద్యార్థులు

- పహల్గాం మృతులకు నివాళులు అర్పించిన ప్రజలు
- కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించిన విద్యార్థులు, నాయకులు



తాడెంలో గ్రామస్తులు, చిన్నారులు

మోపాల్/ సుభాష్‌నగర్: పహల్గాంలో ఉగ్రవాదుల దాడి అత్యంత కిరాతకమని జిల్లా ప్రజలు, ప్రజా, రాజకీయ, విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. ఉగ్రవాదులను కేంద్ర ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని కోరారు. కశ్మీర్‌లోని పహల్గాం బైసరీన్ వ్యాలీలో ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని శనివారం పలు చోట్ల కొవ్వొత్తులతో ర్యాలీలు నిర్వహించారు. నగరంలోని ఆదర్శనగర్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో, మోపాల్ మండలంలోని తాడెం గ్రామంలో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన అమరులకు కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. ఆదర్శనగర్‌లోని శివాజీ విగ్రహం నుంచి రైతుబజార్ వరకు జాతీయ జెండాలు, కొవ్వొతులతో ర్యాలీ నిర్వహించి, మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమాల్లో వెల్ఫేర్ కమిటీ ప్రతినిధులు డాక్టర్ కొండా ఆశన్న, అమృతాపూర్ గంగాధర్, మాజీ కార్పొరేటర్ నిచ్చెంగ్ లత కృష్ణ, సాంబన్న, తాడెంలో భుజేందర్, జలంధర్‌రెడ్డి, సాయి, శ్రీనివాస్‌రెడ్డి, కుమార్, మహేందర్, అరుణ్, నారాయణ, చిన్నారులు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ ఏజెంట్ల ఆధ్వర్యంలో..

నిజామాబాద్‌నాగారం: ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన అమరులకు ఎల్‌ఐసీ ఏజెంట్లు కొవ్వొత్తులో ర్యాలీ నిర్వహించారు. కేంద్రం వెంటనే ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దినేశ్ కుమార్, అల్లోల శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్, ఎల్‌ఐసీ ఏజెంట్లు పాల్గొన్నారు.

ఐఎంఏ ఆధ్వర్యంలో..

నిజామాబాద్‌నాగారం: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నిజామాబాద్, ప్రభుత్వ వైద్య, నర్సింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల నుంచి పాత కలెక్టర్ గ్రౌండ్ వరకు వైద్యులు, వైద్య, నర్సింగ్ కళాశాల విద్యార్థులు నల్ల బ్యాడ్జీలు ధరించి కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు అజ్జ శ్రీనివాస్, విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ.. పహల్గాంలో పర్యాటకులపై దాడి చేయడం కిరాతకమైందని అన్నారు. వెంటనే కేంద్రం నిందితులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఏలేటి రవీంద్రరెడ్డి, జీవన్‌రావు, శ్రీశైలం, బొద్దుల రాజేంద్ర ప్రసాద్, శ్రీహరి, కృష్ణమూర్తి, రామ్మోహన్ రావు, సురేశ్ కుమార్, పద్మజ, సుభాష్, వినోద్ కుమార్ గుప్తా, కవితరెడ్డి, అరుణ, పద్మిణి, పూర్ణిమ, డీఎల్ఎన్ స్వామి, హరీశ్ స్వామి, అర్చన, రాజేందర్ సూరినీడు, గోవింద్, వేణు గోపాల్, దీపక్ రాథోడ్, రవితేజ, చంద్రకాంత్, జగన్, కొండా సంతోష్, వైద్యులు, విద్యార్థులు, పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఎల్‌ఐసీ ఏజెంట్లు

కొలిప్యాక్‌లో..

జక్రాన్‌పల్లి: జమ్ముకశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రదాడికి నిరసనగా జక్రాన్‌పల్లి మండలం కొలిప్యాక్‌లో ధర్మసమాజ్ పార్టీ, గ్రామ యూత్ సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఉగ్రదాడిలో మరణించిన మృతులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి దాసరి రవి, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



జక్రాన్‌పల్లి మండలం కొలిప్యాక్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు



ఆదర్శనగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

కుంభమేళాను తలపించేలా రజతోత్సవ సభ



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా

- ప్రజల కోసమే పనిచేసిన పార్టీ బీఆర్ఎస్
- అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా

నిజామాబాద్‌అర్బన్: హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభ కుంభమేళాను తలపించి చరిత్రలో నిలిచిపోనుందని నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వేడుకను విజయవంతం చేసేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా తెలంగాణను తీసుకొచ్చిన గొప్ప వీరుడని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేపట్టిందని పేర్కొన్నారు. కరోనా లాంటి విపత్తు ఏర్పడినా పింఛన్‌దారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తూ పబ్బం గడుపుతోందని అన్నారు. సభకు బయలుదేరే వారికి భోజనాలు, ఇతర సౌకర్యాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. నగరంలోని 35వ డివిజన్ నాయకుడు నరేశ్ ఆధ్వర్యంలో కొంత మంది యువకులు బీఆర్ఎస్ పార్టీ లో చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్యే కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రజతోత్సవ వేడుకల సందర్భంగా పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు గులాబీ షర్టులు ధరించి సంబురాలు చేపట్టారు. డీజే పాటలతో డ్యాన్సులు చేశారు. కార్యక్రమంలో నగర మాజీ మేయర్ దండు నీతూకిరణ్, జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, పార్టీ నగర అధ్యక్షుడు సిర్ప రాజు, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు సుజిత్ సింగ్ ఠాకూర్, రవి చందర్, సత్య ప్రకాశ్, దండు శేఖర్, ఏనుగందుల మురళి, దారం సాయిలు, నవీద్ ఇక్బాల్, ఇమ్రాన్, మతీన్ తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేశ్ గుప్తా, మాజీ మేయర్ దండు నీతూకిరణ్, నాయకులు

ముదిరాజ్‌లు ఐక్యంగా పోరాడాలి



పడకల్‌లో మాట్లాడుతున్న సురేశ్

జక్రాన్‌పల్లి: ముదిరాజ్‌లు తమ హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని, తెలంగాణాలోని అన్ని రాజకీయ పార్టీలు ముదిరాజ్‌లకు తీరని అన్యాయం చేస్తున్నాయని ముదిరాజ్ సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు అల్లాదుర్గం సురేశ్ అన్నారు. శనివారం జక్రాన్‌పల్లి మండలంలోని పడకల్‌లో ముదిరాజ్‌ల సామాజిక, ఆర్థిక, రాజకీయ వెనుకబాటుతనంపై జిల్లా ముఖ్య నాయకులతో చర్చా వేదిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. సుప్రీం కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికి ముదిరాజ్ కులాన్ని బీసీ–డీ జాబితా నుంచి బీసీ –ఏ లోకి మార్చడంలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. ఈ విషయంలో గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయన్నారు. ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ముదిరాజ్‌ల రిజర్వేషన్ శాతాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాలుగారి నర్సింలు, శ్రీనివాస్, సంజయ్, రంగి శ్రీనివాస్, గోనెల కుమార్, నారాయణ, సుదర్శన్, గంగాధర్, అనిల్, అరుణ్, రాజేశ్వర్, దేవేశ్, సభ్యులు పాల్గొన్నారు.

డాక్టరేట్ అందుకున్న లక్ష్మణ్



నిజామాబాద్ నాగారం: బహుజన సమాజ్ పార్టీ నాయకుడు, జిల్లా కేంద్రానికి చెందిన నీరడి లక్ష్మణ్‌కు డాక్టరేట్ లభించింది. శనివారం తమిళనాడులోని హోసూర్‌లో ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ప్రముఖులు కరాటే శ్రీకాంత్, కేఎస్ వేణుగోపాల్, అరుణ్ చిన్నదురై, లయన్ ఎస్పీ చబ్బి చేతుల మీదుగా లక్ష్మణ్ డాక్టరేట్‌ను అందుకున్నారు. లక్ష్మణ్ మాట్లాడుతూ.. తాను చేసిన సామాజిక సేవా కార్యక్రమాల గుర్తింపునకు గాను ఈ అవార్డు వచ్చినట్లు తెలిపారు.

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	జింఖానా(తెలుగు)-11.00, 4.40, 7.40, 10.30
	అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి(తెలుగు)-1.40
స్క్రీన్-2	సారంగపాణి జాతకం(తెలుగు)- 10.40, 1.30, 4.30, 7.30, 10.30
స్క్రీన్-3	చౌర్యపాఠం(తెలుగు)-11.0
	సూర్యపేట జంక్షన్(తెలుగు)-4.40, 10.20
	అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి(తెలుగు)-7.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	సారంగపాణి జాతకం(తెలుగు)- 10.40, 1.30, 4.20, 7.10, 10.00
స్క్రీన్-2	శివశంభో(తెలుగు)-11.10
	జింఖానా(తెలుగు)-10.40
స్క్రీన్-3	జింఖానా(తెలుగు)-11.25, 7.25
	చౌర్యపాఠం(తెలుగు)- 2.20
స్క్రీన్-4	ఏఎల్‌సీసీ ఓ యునివర్సల్ బ్యాచలర్ -11.25
	అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి(తెలుగు)-2.00
	సోదరా(తెలుగు)-7.35
	సూర్యపేట జంక్షన్(తెలుగు)-10.25

లలితామహల్ సారంగపాణి జాతకం (తెలుగు)

దేవి జింఖానా(తెలుగు)-11.00 2.00

అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి (తెలుగు)- 6.00 10.00

నటరాజ్ సూర్యాపేట్ జంక్షన్ (హిందీ)

విజయ్ మ్యాడ్ స్క్వేర్ (తెలుగు)

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	10	20	గాజరుగడ్డ	40	80
బెండకాయ	35	50	పచ్చిమిర్చి	40	60
బీరకాయ	50	80	దోసకాయ	12	24
దొండకాయ	25	50	ఆలుగడ్డ	25	50
బీర్నీసుకాయ	100	150	గోబిగడ్డ	12	24
కాకరకాయ	35	60	గోబిపువ్వు	35	60
వంకాయ	20	40	బీట్‌రూట్	20	40
పాలకూర	15	30	కరివేపాకు	60	100
మెంతికూర	70	100	చామగడ్డ	60	80
కొత్తిమీర	25	50	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	60	చిక్కుడుకాయ	50	80
క్యాప్సికం	50	80	మామిడికాయ	20	40

–సుభాష్‌నగర్

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

సుభాష్‌నగర్: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసేలా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలని భారతీయ జనతా కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు నూతుల శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని రైతులతో కలిసి పరిశీలించారు. అక్కడున్న మహిళా రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో అనేక కేంద్రాల్లో ధాన్యం సేకరణ ప్రారంభించకపోవడం సమస్యకు అడ్డం పడుతోందని ఆయన అన్నారు. 15 రోజులు గడిచినా కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లపై డీఎం, డీఎస్‌వోతో మాట్లాడినట్లు పేర్కొన్నారు. అకాల వర్షాలు కురుస్తున్నందున కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వర్షాలకు ధాన్యం తడవకుండా టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలన్నారు. నాయకులు గంగోనె సంతోష్, ప్రవీణ్, రాజేందర్, సుదర్శన్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలి



ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

డిచ్‌పల్లి: మండలంలోని కమలాపూర్ గ్రామానికి వంద ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని వాటిలో ఇప్పటి వరకు 29 ఇళ్ల నిర్మాణపనులు కొనసాగుతున్నాయని ఎంపీడీవో బుక్యా లింగం నాయక్ తెలిపారు. మిగిలిన 71 ఇళ్ల లబ్ధిదారులు త్వరలో నిర్మాణ పనులు మొదలు పెట్టాలని కోరారు. శనివారం కమలాపూర్ గ్రామాన్ని సందర్శించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం 5 ఇళ్లు బేస్‌మెంట్ లెవల్ వరకు పనులు పూర్తయ్యాయని అయా లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున డబ్బులు మంజూరైనట్లు ఎంపీడీవో తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ఇందిరమ్మ కమిటీ సభ్యులతో చర్చించి జాగ్రత్త వహించాలని పంచాయతీ కార్యదర్శి రాధికకు సూచించారు. అనంతరం ఎంపీడీవో లింగం నాయక్ నర్సింగ్‌పూర్, రాంపూర్, కమలాపూర్ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఉపాధి కూలీలు, ఈజీఎస్ సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వేసవి ఎండలు ఎక్కువగా ఉన్నాయని కూలీలకు పని ప్రదేశంలో తాగునీటి, నీడ కోసం టెంట్ సౌకర్యం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు.

పొరపాట్లు లేకుండా లబ్ధిదారులను ఎంపిక చేయాలి



వివరాలు తెలుసుకుంటున్న ఎంపీడీవో

మోపాల్: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని ఎంపీడీవో రాములు నాయక్ సూచించారు. శనివారం మోపాల్ మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వివరాలను పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరై ఇంటి నిర్మాణానికి సిద్ధంగా ఉన్న వారి ప్రస్తుత నివాసాలను సందర్శించారు. ఎంపీడీవో మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎంపిక చేయాలన్నారు. మండలంలో 21 జీపీల్లో 2917 మంది ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోగా 2216 మందిని అర్హులుగా గుర్తించామన్నారు. ఎంపిక సమయంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులతో చర్చించాలని, లోపాలు లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి, కారోబార్లు ఉన్నారు.

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌ను తిప్పికొట్టండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

డిచ్‌పల్లి: కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను, నాలుగు లేబర్ కోడ్‌లను తిప్పి కొట్టాలని టీయూసీఐ జిల్లా నాయకుడు మురళి అన్నారు. శనివారం డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్‌లో మేడే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని 47 కోట్ల మంది శ్రమజీవులలో కేవలం ఏడు కోట్ల మందికి మాత్రమే ఉద్యోగ, సాంఘిక భద్రత, తగిన వేతనాలు అందుతున్నాయని మిగతా 40 కోట్ల శ్రమజీవులకు సరిపడా వేతనాలు అందడం లేదని పేర్కొన్నారు. సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ, సామాజిక భద్రత కోసం పోరాడాలన్నారు. కార్మికులు ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కార్మికులు శ్రీకాంత్, సాయిలు, నరేశ్, నర్సింలు, సాయికుమార్, సుశీల తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరికలు



కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో బాడ్సి శేఖర్ గౌడ్

మోపాల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు, ప్రజలు స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరుతున్నారని టీపీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్ గౌడ్ తెలిపారు. శనివారం నగరంలోని తన నివాసంలో మండలంలోని చిన్నాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. వీరికి శేఖర్ గౌడ్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌కు నూకలు చెల్లాయని, కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేసి వచ్చే ఎన్నికల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు చిన్నాపూర్ పోశెట్టి, కేసి రెడ్డి నర్సారెడ్డి, గోద నర్సయ్య, బూగ చిన్న గంగారాం, గోద లక్ష్మణ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.